క్లుప్తంగా

వెండి హారం బహూకరణ



వెండి హారం అందజేస్తున్న నాగేంద్ర దంపతులు

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు జట్ల కొండూరులోని సాయిబాబా మందిరాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. మనుబోలులో బాబాకు గ్రామానికి చెందిన పొట్టి నాగేంద్ర గుప్తా, అనురాధ దంపతులు వెండి హారాన్ని బహూకరించారు.

➡ పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



వెంకటాచలం: బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని కసుమూరు ఎస్టీ కాలనీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లిక గిరిజనులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల జరిపించడం వల్ల బాలికలు ఆరోగ్య పరమైన సమస్యలతో బాధపడాల్సి వస్తుందని తెలియజేశారు. బాల్య వివాహాలు గురించి తెలిసిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో కసుమూరు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో అలజడి



కోడూరు తీరం

తోటపల్లిగూడూరు: బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో మండలంలోని కోడూరు, వెంకన్నపాళెం తీర ప్రాంతాలు అల్లకల్లోలంగా మారాయి. సముద్రం సుమారు 25 నుంచి 30 అడుగుల మేర ముందుకు చొచ్చుకొని రావడంతో తీరం కోతకు గురైంది. మత్స్యకారులు వేటకు విరామం పలికి ఇళ్లకే పరిమితమయ్యారు. చలిగాలులు అధికమయ్యాయి.

'వెంకటేశ్వర'లో సాంకేతిక ప్రదర్శన



కొడవలూరు : నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో సాంకేతిక ప్రదర్శన గురువారం జరిగింది. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి రవాణా, గృహోపకరణాల అనుసంధానంపై నమూనాలు ప్రదర్శించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ అందజేశారు. ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు, ఎంసీఏ విభాగాధిపతి రాజశేఖర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు పాటూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

కోవూరు: ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు మండలంలోని పాటూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గణపర్తి వెంకటేశ్వర్లునాయుడు తెలిపారు. గురువారం స్కూల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అండర్ – 14, 17, 19 పోటీల్లో జి.అమూల్య, జి.జానకి, పి.వెంకటమాధవి, కె.తేజ, కె.జ్యోతివరప్రసాద్, మహేంద్ర ప్రతిభ చూపారన్నారు. వారు ఛత్తీస్‌గఢ్‌లో డిసెంబర్ 2వ తేదీ నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ భీమతాటి వెంకటరమణయ్యను అభినందించారు.

సంక్షేమ హాస్టల్.. సమస్యల నిలయం

సంక్షేమ హాస్టళ్ల గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. విద్యార్థులు అధ్వాన పరిస్థితుల మధ్య గడుపుతున్నా సర్కారు పెద్దలు తమకేం పట్టనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో టీపీగూడూరులోని బీసీ వసతి గృహంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- టీపీగూడూరు బీసీ వసతి గృహంలో అధ్వాన పరిస్థితులు
- అద్దె భవనంలో అగచాట్లు
- వర్షం వస్తే నరకమే..
- ఉండలేమంటూ విద్యార్థుల ఇళ్లదారి



హాస్టల్ లోపల చేరిన వర్షపునీరు

తోటపల్లిగూడూరు: మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ శాఖ వసతి గృహం సమస్యల వలయంలో కొట్టుమిట్టలాడుతోంది. కనీస సౌకర్యాల లేమితో తాముండలేమంటూ విద్యార్థులు ఇళ్లబాట పట్టాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇక్కడ ప్రస్తుతం 40 మంది విద్యార్థులున్నారు. వీరంతా సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. అద్దె గృహంలో నిర్వహిస్తున్న ఈ హాస్టల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో క్రమంగా పిల్లల సంఖ్య తగ్గుతోంది.

ఎన్నో సమస్యలు

రేకుల షెడ్ అయిన ఈ అద్దె గృహంలో ఆరు గదులున్నాయి. వర్షం వస్తే నాలుగు గదులు చిత్తడిగా మారుతున్నాయి. మిగిలిన రెండు గదుల్లోనే 40 మంది ఇరుక్కొని వసతి పొందాల్సి వస్తోంది. విద్యార్థులు స్నానానికి ఉపయోగించే వాటర్ ట్యాంక్ దశాబ్దాల క్రితం నిర్మించింది కావడంతో అధ్వాన స్థితికి చేరుకుంది. ఒకే కుళాయి ఉంది. దీని ద్వారానే అందరూ నీటిని వినియోగించాలి. మరుగుదొడ్ల విషయానికొస్తే హాస్టల్లో ఉన్నవి రెండే రెండు. వీటిలోనూ కుళాయిలు లేకపోవడంతో వాటర్ ట్యాంక్ నుంచి బకెట్లతో నీళ్లు మోసుకెళ్లాల్సిందే.

ఉండలేక..

వసతి గృహ ప్రాంగణం లోతట్టు ప్రాంతం కావడంతో వర్షా కాలంలో నీరు చేరుతోంది. ఎదురుగా ఉండే తోటపల్లిగూడూరు మెయిన్ రోడ్డు నిర్మాణ పనులతో ఎత్తుగా మారిపోగా హాస్టల్ ప్రాంగణం మరింత కిందకు దిగిపోయింది. దీంతో వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. మూడురోజులుగా కురుస్తున్న వానలకు యథాప్రకారం నీరు హాస్టల్‌ను చుట్టుముట్టింది. ఈ పరిస్థితుల్లో ఇక్కడ ఉండలేక ఉన్న విద్యార్థులు ఒక్కొక్కరిగా ఇంటిబాట పట్టారు. వసతులు కల్పించే విషయంలో వార్డెన్ నరసింహమూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. విడవలూరులోని మరో హాస్టల్‌కు ఈయన ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి వసతి గృహాన్ని పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



వానొచ్చిందంటే నీళ్లు హాస్టల్‌ను చుట్టుముట్టేస్తున్నాయి. స్కూల్‌కు వెళ్లాలన్నా.. తిరిగి హాస్టల్‌కు రావాలన్నా వరద నీటి కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కాళ్లు పాచిపోవడంతో హాస్టల్‌ను వదిలి ఊరికి వెళ్లిపోతున్నా.

– కిశోర్, హాస్టల్ విద్యార్థి



వాటర్ ట్యాంక్ వద్ద ఇలా..



విరిగిన మరుగుదొడ్ల తలుపులు



హాస్టల్ బయట వర్షపునీరు

సర్వేకు ప్రజలు సహకరించాలి

- అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ



వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ

పొదలకూరు: అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీసీడీ) సర్వే కోసం వచ్చే వైద్యాధికారులు, సిబ్బందికి ప్రజలు సహకరించి వివరాలు వెల్లడించాల్సిందిగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్వో కాలనీలో వైద్య సిబ్బంది చేపట్టిన సర్వేను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేలో లెప్రసీ, షుగర్, బీపీ, కేన్సర్ వ్యాధులకు సంబంధించి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఆహారపు అలవాట్ల గురించి తెలుసుకుని ముందస్తుగా అసంక్రమిత వ్యాధులను గుర్తించి చికిత్స అందజేస్తామన్నారు. కేన్సర్‌ను ముందుగా గుర్తించి చికిత్స అందిజేస్తే నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కిరణ్ రిషిత, పర్యవేక్షకులు మస్తాన్‌బీ, సూపర్‌వైజర్ విజయ్, ఆరోగ్య సహాయకులు సాని శివప్రసాద్, హెల్త్ ప్రొవైడర్ సుమాంజలి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పక్కాగా కేన్సర్ స్క్రీనింగ్

కొడవలూరు : గ్రామాల్లో ఇంటింటి కేన్సర్ స్క్రీనింగ్ సర్వేను పక్కాగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిత ఆదేశించారు. మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న సర్వేను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విద్యార్థుల వైద్య పరీక్షల కార్యక్రమం(4–డీ స్క్రీనింగ్)ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ కేన్సర్ స్క్రీనింగ్ సర్వే ద్వారా కుటుంబంలో ఎవరైనా బాధితులున్నారా.. లేదా? అనే అంశాలను తెలుసుకోవాలన్నారు. సర్వే సమగ్రంగా ఉండాలన్న ఉద్దేశంతోనే రోజులో పరిమితమైన గృహాలను మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. కేన్సర్‌తో పాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధుల వివరాలను కూడా సమగ్రంగా సేకరించాలన్నారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్య, హెచ్ఎస్ రజియ, ఏఎన్ఎం సుకన్య, హెచ్‌పీఎం.సురేష్ ఉన్నారు.

కొడవలూరులో..

నార్తురాజుపాళెంలో జరుగుతున్న కేన్సర్ స్క్రీనింగ్ సర్వేను వైద్యాధికారి ఎం.రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ, ఏఎన్ఎం దీనమ్మ పాల్గొన్నారు.



నార్తురాజుపాళెంలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారి రామకృష్ణ



యల్లాయపాళెం హైస్కూల్లో ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న డాక్టర్ బ్రిజిత

మనుబోలులో ట్రైయినీ కలెక్టర్ల పర్యటన

మనుబోలు: ట్రైయినీ కలెక్టర్లు సిద్ధార్థ శ్రీవాస్తవ, మౌనికా పటేల్, వినోద్‌కుమార్ మీనా, మోహన్‌లాల్ గురువారం మండలంలో పర్యటించారు. మనుబోలు సచివాలయం – 1లో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. సమస్యలు, వనరులు, ఉపాధి అవకాశాలు, పాలనా వ్యవస్థ, ఉపాధి హామీ పనులు, వ్యవసాయం, మార్కెటింగ్ తదితర వాటి గురించి చర్చించారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను దండు చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు. గత ప్రభుత్వంలో తెచ్చిన సచివాలయ వ్యవస్థ, విద్య, వైద్య రంగాల్లో వచ్చిన మార్పులను ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రస్తావించారు. చెలికం కోటేశ్వరరెడ్డి తదితరులు పలు సమస్యలను వారికి వివరించారు. అనంతరం ఐఏఎస్‌లు చంద్రమౌళీనగర్ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. హైస్కూల్లో శ్రమదానం చేశారు. ఆపై బద్దెవోలు రోడ్డు సమీపంలోని నిమ్మ, సవక తోటలను పరిశీలించారు. వారి వెంట డీపీఓ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ కంచి పద్మమ్మ, ఎంపీడీఓ జలజాక్షి, కార్యదర్శి గరుడయ్య, ఏపీఎం వనజాక్షి, వీఆర్వో నాగార్జునరెడ్డి తదితరులున్నారు.



ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశమైన ట్రైయినీ కలెక్టర్లు

వ్యవసాయాధికారి పరిశీలన

మనుబోలు: రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని మడమనూరు, జట్ల కొండూరు గ్రామాల పరిధిలో నారుమళ్లను గురువారం మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా అక్కడక్కడా నారుమళ్లు నీట మునిగాయన్నారు. ఎక్కువ రోజులు నీటిలోనే ఉంటే పాచిపోయే ప్రమాదం వుందన్నారు. రైతులు కాలువ తీసి నీటిని బయటకు పంపాలని సూచించారు. ఇలా చేస్తే నారుమడి దెబ్బతినకుండా ఏపుగా పెరుగుతుందన్నారు. ఆయన వెంట ఏఈఓ కళారాణి, వీఏఏలు ఇర్షాద్, ప్రశాంత్ ఉన్నారు.

ట్రూ అప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలి

కొడవలూరు: విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ డిమాండ్ చేశారు. ప్రజాపోరులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరిట రూ.6,400 కోట్ల భారం మోపిందని విమర్శించారు. మద్యాన్ని బెల్టు షాపుల ద్వారా విచ్చలవిడి చేసి మహిళలపై దాడులను ప్రోత్సహిస్తోందని దుయ్యబట్టారు. నిత్యావసర ధరలు అమాంతం పెరిగినా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.నరసింహం, దేవానంద్, బి.శామ్యూల్, బి.కాంతారావు, మహబూబ్, నాగమ్మ పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం ఎదుట..

ముత్తుకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సీపీఎం మండల కార్యదర్శి గడ్డం అంకయ్య ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలుష్య కోరల్లో చిక్కుకొన్న మండలవాసులకు సీఎస్సార్ నిధుల ద్వారా నెలకు 25 కిలోల బియ్యం, రూ.3,000 నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మత్స్యకారేతర ప్యాకేజీని చెల్లించాలని కోరారు. కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో నక్కారాధయ్య, షేక్ మస్తాన్, బ్రహ్మదేవి మోహనరావు, విజయకుమార్ పాల్గొన్నారు.

హామీల అమల్లో కూటమి విఫలం

బుచ్చిరెడ్డిపాళెం: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు అన్నారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. కోవూరు వద్ద ఉన్న చక్కెర కర్మాగారాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. మండల నాయకులు పోతంశెట్టి శ్రీనివాసులు, పుత్తేటి మల్లికార్జున, అంకయ్య, మునుస్వామి, సురేష్, మల్లికార్జున, రఘురామయ్య, మునీర్ అహ్మద్, జానీబాషా, దత్త శ్రీకోటయ్య పాల్గొన్నారు.



ముత్తుకూరు: ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



కొడవలూరు : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు



బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో..

పిల్లలూ.. కలలు సాకారం చేసుకోండి

ముత్తుకూరు: 'పిల్లలూ మీ కలల్ని సాకారం చేసుకునేందుకు బాగా కష్టపడండి' అని వక్తలు పిలుపునిచ్చారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా పంటపాళెంలోని యూపీ స్కూల్లో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, మ్యూజికల్ పోటీలు జరిగాయి. త్రిపుల్‌ఎఫ్ పామాయిల్ సంస్థ విజేతలకు 48 బహుమతులు అందజేసింది. కార్యక్రమంలో సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, సంస్థ ప్రతినిధులు శేఖర్‌రెడ్డి, సునీల్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ బ్రహ్మానందం, నాయకులు పల్లంరెడ్డి రామమ్మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, హెచ్ఎం కృష్ణమోహన్ పాల్గొన్నారు.

➡ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో అండర్ 14, 17 క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హెచ్ఎం తాన్య బహుమతులు అందచేశారు. టీచర్లు పాల్గొన్నారు.

➡ విడవలూరు: మండలంలోని అలగానిపాడు జెడ్పీ హైస్కూల్లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మేడిచర్ల శ్రీనివాసులు మాట్లాడారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన నార్నె వెంకటేశ్వర్లు పదో తరగతి విద్యార్థులకు చేతి గడియారాలను అందజేశారు. ఉపాధ్యాయులు అమర్‌నాథ్, షావలి, సుబ్బారావు, కుమారి పాల్గొన్నారు.

➡ విడవలూరులోని గ్రంథాలయంలో నెహ్రూ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పి.నరేష్ పాల్గొని, మాట్లాడారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయిని ధనలక్ష్మి, లైబ్రేరియన్ టి.నిరూప పాల్గొన్నారు.

➡ వెంకటాచలం: మండలంలోని ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవి అసోసియేషన్ సంస్థ తరపున జి.మాల్యాద్రి రూ.30 వేలు విలువ చేసే గ్రంథాలయ పుస్తకాలను పాఠశాలకు బహూకరించారు. అలాగే పాఠశాల పూర్వ విద్యార్థిని గీతిక చేయి ఆపరేషన్ కోసం నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలపతి, ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్వతీశం, ఉపాధ్యాయులు మాధవ్, కవిత తదితరులు పాల్గొన్నారు.



ముత్తుకూరు: విద్యార్థినికి బహుమతి అందజేత

➡ తోటపల్లిగూడూరు: మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ జీవిత విశేషాలను టీచర్లు విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం షేక్ అహ్మద్‌బాషా, పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ గిరిజాకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

➡ మండలంలోని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, పీడీ నాగరాజు, టీచర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: విజేత స్కూల్లో చిన్నారులతో టీచర్లు

➡ కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా గురువారం నెహ్రూ జయంతిని నిర్వహించారు. గ్రంథాలయ ఫౌండర్ ఇసనాక సుధాకర్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ కట్టా ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నేత చిల్లకూరు యుగంధర్‌రెడ్డి, ట్యూటర్ వి.రాజేష్ పాల్గొన్నారు.

➡ కొడవలూరు గ్రంథాలయంలో రిటైర్డ్ హెచ్ఎం వెంకయ్య ఆధ్వర్యంలో నెహ్రూ జయంతిని జరిపారు. గ్రంథాలయాధికారి కె.రాజేశ్వరి, హైస్కూల్ టీచర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

➡ పొదలకూరు: పట్టణంలో నాగార్జున స్కూల్లో విద్యార్థులు గురువారం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ సునీతారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.లక్ష్మీదుర్గ, అడ్వైజర్ అన్నం సుబ్బారావు, డీన్ కృష్ణ, డైరెక్టర్స్ జీఎస్ రెడ్డి, ఎ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ పాపయ్య, యాదవ్ పాల్గొన్నారు. విజేత ఇంగ్లిష్ మీడియం స్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ జి.కామాక్షి మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లింగపల్లి ఎస్సీ కాలనీ–1 పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డేగ యశ్వంత్‌రెడ్డి విద్యార్థులకు డ్రాయింగ్ కిట్స్, స్టేషనరీ, చాక్లెట్ ప్యాకెట్లను అందజేశారు. హెచ్ఎం సుభాన్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు. మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వీట్లు, భోజనం ఏర్పాటు చేశారు. క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. హెచ్ఎం సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు. అమరావతి స్కూల్లో కరస్పాండెంట్ కె.సురేష్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టీపీగూడూరు: చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలలో..

➡ ఇందుకూరుపేట: గంగపట్నంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నరసాపురంలోని ఎంవీఆర్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు విద్యాసామగ్రిని అందజేశారు.



ముత్తుకూరు: బ్రహ్మదేవిలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో టీచర్లు



టీపీగూడూరు: సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో..



పొదలకూరు: అమరావతి స్కూల్లో చిన్నారులు



పొదలకూరు: నాగార్జున స్కూల్లో మాట్లాడుతున్న నిర్వాహకులు



విడవలూరు : అలగానిపాడులో..



ఇందుకూరుపేటలో..



వెంకటాచలం: ఇస్కపాళెం పాఠశాలలో..



కొడవలూరు : యల్లాయపాళెం గ్రంథాలయంలో..



కొడవలూరు గ్రంథాలయంలో..